విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

యాకుత్‌పురా: విద్యార్థులు చదువుతో పాటు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పౌష్టికాహారాన్ని తీసుకోవాలని శాలిబండలోని ప్రభుత్వ సురాజ్ ప్రసూతి ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ హనీష్ అన్నారు. బుధవారం సుల్తాన్‌షాహిలోని శాలిబండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు స్థానిక మెడికల్ షాపుల్లో మందులు తెచ్చుకోకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలని, పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరినారాయణ, ఉపాధ్యాయులు డాక్టర్ విజయ్ భాస్కర్, శ్రీదేవి, మంజుల, ప్రమీల, నవనీత, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డుల ప్రదానం



కె.ప్రకాష్‌కు అవార్డును అందజేస్తున్న ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ సాహిత్య కళాపీఠం ఆధ్వర్యంలో ప్రముఖ సాంస్కృతిక సంస్థ శిల్పా ఆర్ట్స్ క్రియేషన్స్ అధినేత కె.ప్రకాష్‌కు ఉత్తమ ఆర్గనైజర్ అవార్డు లభించింది. బుధవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు సాహిత్య కళాపీఠం 14వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలలో రాణిస్తున్న ప్రముఖులను అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ వెంకటనారాయణ, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, అసోసియేషన్ వ్యవస్థాపకులు చిక్క రామ్‌దాస్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాసి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



క్విజ్ పోటీల విజేతలతో దామోదర్ గుప్తా

గన్‌ఫౌండ్రీ: భారతదేశాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసిన ఘనత దేశ తొలి ప్రధాని నెహ్రూకు దక్కుతుందని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె.దామోదర్ గుప్తా అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, హరినారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మాజీ ప్రధాని నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై నిర్వహించిన క్విజ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అంతకు ముందు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రముఖ ఆయుర్వేద వైద్యులు బి.ఆనందయ్య, కవయిత్రి రాధాకుసుమ, ఆయుర్వేద నిపుణులు కూరపటా శ్యామ్ దన్, అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దేవాలయంలో ఘనంగా అంకుట్ పూజ

నాంపల్లి: శ్రీ బల్వీర్ భక్త సమాజ్ ఆధ్వర్యంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కబూతర్ ఖానాలోని హనుమాన్ దేవాలయంలో బుధవారం అంకుట్ ప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజలకు టీపీసీసీ లింగ్విస్టిక్ మైనార్టీ సెల్ నేత మురళీ మోహన్ అశోక్ సింగ్ హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రవీణ్ చౌక్సా, అకాష్ అగర్వాల్, మనోహర్, సంజీవ్ కుమార్, బన్సీరాజ్, టి.శ్రీనివాస్ రావు, సుభాష్, విజయ్ శర్మ, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

వినూత్న ఆవిష్కరణలకు నాంది పలకాలి

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులు ఉద్యోగాల కోసం కాకుండా పలువురికి ఉపాధి కల్పించేందుకు వినూత్న ఆవిష్కరణలకు నాంది పలకాలని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఎండీ డాక్టర్ నందితా సేథి అన్నారు. బుధవారం అబిడ్స్‌లోని స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నూతన స్టార్టప్ ఆవిష్కరణలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... నూతన స్టార్టప్‌లు ప్రారంభించడానికి ఇష్టపడే విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సత్యప్రసాద్, ప్రోగ్రామ్ కన్వీనర్ ప్రొఫెసర్ రవికిశోర్, డాక్టర్ శివాని యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నాంపల్లి కోర్టులో ఉచిత కంటి వైద్య శిబిరం

సిటీ కోర్టులు: నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ సీవీ శ్రీనాథ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏసీబీ కోర్టు బార్ అసోసియేషన్‌లో ఏర్పాటు చేస్తున్న ఉచిత శిబిరంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. న్యాయవాదులతోపాటు కోర్టు సిబ్బంది ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరికి జైలు శిక్ష

గౌలిపురా: గంజాయి సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులకు బుధవారం నాంపల్లిలోని కోర్టు స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ డి.సి.ఉమాపతి రావు ఐదు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన మహ్మద్ సోహేల్, నషేమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఇమ్రాన్ ఖాన్ ఇటీవల భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి సేవిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిపై వీరిపై కేసు నమోదు చేసి బుధవారం నాంపల్లిలోని కోర్టులో హాజరుపరిచారు. కేసు పూర్వ పరాలను పరిశీలించిన స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ నిందితులకు ఐదు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

ప్రభుత్వ వైద్యుల | సమస్యలను పరిష్కరించండి

నాంపల్లి: తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సమస్యలను పరిష్కరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నరహరి, సెక్రటరీ జనరల్ డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్ అన్నారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి ప్రభుత్వ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఇటీవల అడ్వకేట్ కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వైద్యుల సంఘం ఎన్నికలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షుడి డాక్టర్ నరహరి, సెక్రటరీ జనరల్ డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్, కోశాధికారి డాక్టర్ రవూఫ్ ఎన్నికైనట్లు మంత్రికి తెలిపారు. త్వరలోనే రాష్ట్ర స్థాయి సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రధానంగా 142 జి.ఓ రద్దు, పీజీ చేసిన వారి సరెండర్స్, రెగ్యులర్ ప్రమోషన్స్, వివిపిని సెకండరీ గ్రేడ్ సర్వీసెస్‌గా మార్పు చేయడం, సుదూర ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు పెరిపెరల్ అలవెన్స్, డీహెచ్.పరిధిలో పనిచేస్తున్న వైద్యులకు టైంబౌండ్ ప్రమోషన్స్ వంటి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ డిమాండ్లపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సెక్రటరీ జనరల్ డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్ తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దీనదయాళ్, నాయకులు డాక్టర్ రామ్‌సింగ్, డాక్టర్ రాజు, డాక్టర్ కవి రమేష్, డాక్టర్ వినోద్, డాక్టర్ రాధిక, డాక్టర్ జాహ్నవి, డాక్టర్ అమరావతి, డాక్టర్ వెంకటమణి తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి సమస్యలు వివరిస్తున్న డాక్టర్ నరహరి, డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్

డబ్బులు డిమాండ్ చేసిన ఫ్రీలాన్స్ జర్నలిస్టు రిమాండ్

డబీర్‌పురా: సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తూ డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తిని రెయిన్‌బజార్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఇమ్లిబన్ ప్రాంతానికి చెందిన మహ్మద్ అబ్దుల్ లతీఫ్‌కు మహేశ్వరం మండలం నాగారం గ్రామంలో సర్వే నంబర్ 194లో 30 గుంటల భూమి ఉంది. హాక్ మీడియా హౌస్‌కు చెందిన ఫ్రీలాన్స్ జర్నలిస్టు తన్వీర్ అహ్మద్ ఖాజా (54) అబ్దుల్ లతీఫ్ కుటుంబంపై సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్‌లో దుష్ప్రచారం చేస్తూ పోస్టు చేశాడు. ఈ పోస్టును తొలగించడానికి తన్వీర్ అహ్మద్ అబ్దుల్ లతీఫ్‌ను రూ. లక్ష డిమాండ్ చేశాడు. కోఠిలోని ఓ లాడ్జిలో డబ్బులు ఇవ్వాలని కోరాడు.. అబ్దుల్ లతీఫ్ రూ.70 వేల నగదు తన్వీర్ అహ్మద్‌కు అందజేస్తుండగా రెయిన్‌బజార్ పోలీసులు దాడులు చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

కరుణశ్రీకి డాక్టరేట్



కరుణశ్రీ

సుల్తాన్‌బజార్: తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎం.కరుణశ్రీ అర్థశాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ప్రొఫెసర్ జె.నర్సింహారావు పర్యవేక్షణలో 'భారతదేశంలో వ్యవసాయ ఉత్పాదక - తెలంగాణ రాష్ట్రంపై ప్రత్యేక దృష్టి' అంశంపై పరిశోధనలు చేశారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం అధ్యాపకులు ఆమెను అభినందించారు. అనంతరం ఆమెను విశ్వవిద్యాలయం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సుధాకర్ రెడ్డి, ప్రొఫెసర్ రాములు, డాక్టర్ లక్ష్మీ, డాక్టర్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి



సమస్యలు తెలుసుకుంటున్న ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ తదితరులు

అబిడ్స్: డ్రైనేజీ, మంచినీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం ఆయన జాంబాగ్, హిందీనగర్, గోషామహల్ ప్రాంతాల్లో వాటర్‌బోర్డు మేనేజర్ శేఖర్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ... మంచినీరు, డ్రైనేజీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అన్ని ప్రాంతాల్లో మెరుగైన నీటి సరఫరా చేపట్టాలన్నారు. నియోజకవర్గ ప్రజలు సమస్యలను దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అహ్మద్, విజయ్ ముదిరాజ్, సంజయ్, నరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి అమర్లపురి వందన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ప్రముఖ ప్రైవేటు సంస్థల్లోని ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్మీడియేట్, ఏదైన డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయి ఉండి 18 నుంచి 36 ఏళ్ల లోపు నిరుద్యోగులు ఇందుకు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రారంభ వేతనం రూ.12,500 నుండి వారి అర్హత నైపుణ్యాన్ని అనుసరించి రూ.14 వేలతో పాటు ఇతర ఇన్‌సెంటీవ్స్ ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు గురువారం ఉదయం 11 గంటలకు విజయనగర్‌కాలనీలోని హైద రాబాద్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఫొటోలు, సర్టిఫికెట్లతో నేరుగా హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 83284 28933 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జోరుగా కులగణన కార్యక్రమం



సర్వే నిర్వహిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

జియాగూడ: రాష్ట్రంలోని అన్నివర్గాల అభ్యున్నతి కోసమే ప్రభుత్వం కులగణన కార్యక్రమం చేపట్టిందని జియాగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వినోద్ కొలే అన్నారు. బుధవారం జియాగూడలోని డోర్‌బస్తీ, అశోక్‌లాడ్, సోనా హోటల్ తదితర ప్రాంతాలలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ కొలే మాట్లాడుతూ... కులగణన కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు దగ్గర ఉండి విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

గోల్కొండ: గోల్కొండ, షేక్‌పేట్ నాలా, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు టోలిచౌకీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రావు తెలిపారు. బుధవారం ఆయన సిబ్బందితో కలిసి బంజారా దర్వాజా, షేక్‌పేట్ నాలా, డీమార్ట్ తదితర ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు అదనపు సిబ్బందిని నియమిస్తున్నామన్నారు. గోల్కొండ బంజారి దర్వాజా వద్ద ఉన్న ట్రాఫిక్ సిగ్నల్ వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి అదనంగా సెవన్ టూంబ్స్ చౌరస్తా, కఠోరా హౌజ్ మసీదు, అలిజాపూర్ రోడ్డు ప్రాంతాల్లో ట్రాఫిక్ కానిస్టేబుళ్లను నియమించినట్లు తెలిపారు. జి.నారాయణమ్మ ఇంజినీరింగ్ కాలేజీ, డీమార్ట్ తదితర ప్రాంతాల్లో సైతం అదనపు సిబ్బందిని నియమించామన్నారు. అభివృద్ధి పనుల తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాల ట్రాఫిక్ జామ్ కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ఆల్ ఇండియా సీనియర్ రెజ్లింగ్ | పోటీలకు కట్ట మణిశంకర్ ఎంపిక



కట్ట మణిశంకర్‌ను అభినందిస్తున్న దృశ్యం

గోల్కొండ: కార్వాన్ సబ్జీ మండిలోని వీరాభిమన్యు వ్యాయామ శాల నుంచి ఎందరో యువకులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికయ్యారని వ్యాయామ శాల నిర్వాహకులు కట్ట లింగం అన్నారు. బుధవారం హైదరాబాద్ జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుల్తాన్‌షాహీ ప్లేగ్రౌండ్‌లో జరిగిన రాష్ట్ర రెజ్లింగ్ పోటీల్లో మణిశంకర్ ఛాంపియన్‌గా నిలిచారు. ఈ సందర్భంగా ఆయనను కట్ట లింగంతో పాటు వ్యాయామ శాల ప్రతినిధులు అభినందించారు. కట్ట లింగం మాట్లాడుతూ ఉత్తమ శిక్షణకు వీరాభిమన్యు వ్యాయామ శాల పెట్టింది పేరు అన్నారు. మణిశంకర్ డిసెంబర్ 6న బెంగళూర్‌లో జరిగే ఆల్ ఇండియా సీనియర్ రెజ్లింగ్ పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. వీరాభిమన్యు వ్యాయామ శాలకు శిక్షణ కోసం వచ్చే వారందరికి అన్ని రకాల సహాయ సహకారాలు అందించి ఉత్తమ శిక్షణ ఇస్తామన్నారు. కట్ట మణిశంకర్ చౌటుప్పల్‌లోని మధుసుధన్‌రెడ్డి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీలో చదువుతూ క్రమం తప్పకుండా విరాభిమాన్యు వ్యాయామశాలలో శిక్షణ తీసుకునే వాడని తెలిపారు.

నైపుణ్యంతోనే మెరుగైన ఉపాధి



విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేస్తున్న ప్రొఫెసర్ జగదీశ్వర్‌రావు తదితరులు

గన్‌ఫౌండ్రీ: సమాజంలో విద్యార్థులు డిగ్రీ పట్టాలతో పాటు అవసరమైన నైపుణ్యాలను కలిగి ఉన్నప్పుడే మెరుగైన అవకాశాలు అందుకోగలరని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి.జగదీశ్వర్‌రావ్ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో నిజాం కళాశాల స్నాతకోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... ఆకాశమే హద్దుగా విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో అవకాశాలు ఉన్నాయని వాటిని దక్కించుకునేందుకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ ఎం.కుమార్ మాట్లాడుతూ.... విద్యార్థులు సామాజిక మార్పు, దేశ అభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. నిజాం కళాశాలతో పాటు ఓయూలో పెరుగుతున్న విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా హాస్టల్ వసతితో పాటు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ యూజీ కోర్సులలో మెరిట్ మార్కుల్ సాధించిన 49 మంది విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. కార్యక్రమంలో ఓయూ ఎగ్జామ్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.రాములు, నిజాం కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.భీమా, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.ఉపేందర్‌రెడ్డి, కళాశాల ఎగ్జామ్స్ కంట్రోలర్ డాక్టర్ చాంద్‌పాషాలతో పాటు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టం చేయాలి

- న్యాయవాది కళ్యాణ్‌పై దాడి అమానుషం
- ప్రభుత్వాలు న్యాయవాదులకు అండగా నిలువాలి
- నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి

సిటీ కోర్టులు: ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ చట్టం చేయాలని నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. నాంపల్లి కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది కళ్యాణ్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం ఐమాక్స్ థియేటర్ సమీపంలో మార్నింగ్ వాక్ చేస్తున్న కళ్యాణ్‌పై గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో దాడి చేయడమేగాక అతడి సెల్ ఫోన్ లాక్కెల్లారన్నారు. ఈ దాడిలో కళ్యాణ్ చేతికి తీవ్ర గాయాలు కావడంతో లక్డికపూల్‌లోని గ్లోబల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. న్యాయవాది కళ్యాణ్‌పై దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేసి చట్టపరంగా శిక్షించాలని ఆయన కోరారు. ఇలాంటి దాడులు మళ్లీ పునరావృత్తం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరి సీవీ శ్రీనాథ్, ఉపాధ్యక్షుడు గోకుల్, బార్ అసోసియేషన్ మెంబర్లు ఎం.రమేష్, ఈశ్వర్ కుమార్, మల్లేశం, శివకుమార్, ఎన్.కుమార్, మాధవి, కవిత వర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఆర్ కృష్ణ జయంతి

నాంపల్లి: పద్మ భూషణ్ ఏఆర్ కృష్ణ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏఆర్ కృష్ణ జయంతి వేడుకలు బుధవారం రాత్రి పబ్లిక్‌గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎ.ఆర్.కృష్ణ, దుగ్గిరాల పురస్కారాలను ప్రదానం చేశారు. సాహితీవేత్త బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి హాజరయ్యారు. గుమ్మడి గోపాలకృష్ణను ఏఆర్ కృష్ణ పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో కళా డాక్టర్ ఆళ్ళ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ డి.ఎస్.ఎన్.మూర్తి, భగీరథ, బిక్కి కృష్ణ, రామచంద్రరావు, డాక్టర్ మహ్మద్ రఫీ, డాక్టర్ దుగ్గిరాల గౌరీపతి శాస్త్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిరిమువ్వ కల్చరల్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో 'థింక్...?!' నాటికను ప్రదర్శించారు.



గుమ్మడి గోపాలకృష్ణను సత్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

లంగర్‌హౌస్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

◆ 33/11కేవీ ఏఎస్‌ఆర్‌ఆర్ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గుడిమల్కాపూర్, వివిజి గార్డెన్, నవోదయ కాలనీ, సాబెర్ నగర్, గొల్లబస్తి, మురాద్‌నగర్, చోటీ మసీద్, పటేల్ డైరీ ఫాం పరిసర ప్రాంతాలు, రాయల్ సీ హోటల్, ఎస్‌బిఐ కాలనీ, ప్రియ కాలనీ, హీరా నగర్, మహేష్‌నగర్, చైతన్య కళాశాల, బాలాజీ నగర్, సత్యనారాయణ నగర్, క్రిస్టల్ గార్డెన్, సాయి నగర్, పవన్ గార్డెన్, కెఆర్‌కెఎం గార్డెన్, శివబాగ్, రూఫ్ గార్డెన్, మందుల గుడ, ఉషోదయ కాలనీ, పూల మార్కెట్, జీవన్ కళ్యాణ్ నగర్, అలపాటి నగర్, హిల్ కాలనీ, మండి కింగ్, గుడిమల్కాపూర్ ప్రధానరహదారి ప్రాంతాలు, అంబ గార్డెన్, క్రాంతి నగర్, విజయ్‌సాయి అపార్ట్‌మెంట్స్, సాయి గార్డెన్స్, సాయిబాబా దేవాలయం పరిసర ప్రాంతాలు, దోబీఘాట్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.

◆ 11 కేవీ ఎలియాస్ రోడ్, కరోల్‌బాగ్ ఫీడర్ల పరిధిలోని ఎసీగార్డ్స్, ఎస్‌బిఐ కాలనీ, ఐడిబిఐ క్వార్టర్స్, ఆశియన్ అపార్ట్‌మెంట్స్, బజార్ ఘాట్, ఏ బ్యాటరీ లైన్, బిలాల్ మసీద్, ఎపెక్స్ పెయింటింగ్ ప్రెస్, పోలీస్ క్వార్టర్స్, శాంతి నగర్, గోకుల్ నగర్, గ్లోరి థియేటర్, లకిడికాపూల్, మున్సిపల్ కమిషనర్ కార్యాలయం, గంగా జమునా హోటల్, కాలాబంగ్లా, హకీంపేట్, పటేల్ గల్లి, సనా హోటల్, గౌసియా రూఫ్ మసీద్ పరిసర ప్రాంతాలు, ఎస్‌ఎస్‌ఎఫ్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

◆ 11 కేవీ బజార్‌ఘాట్ ఫీడర్ పరిధిలోని బజార్ ఘట్, వుడ్‌బ్రిడ్జ్ హోటల్ పరిసర ప్రాంతాలు, అయోధ్య హోటల్ పరిసర ప్రాంతాలలో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని వినియోగదారులు గమనించి సహకరించాలని అధికారులు కోరారు.

రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి కృషి



ఆనంద్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ప్రభు పూజారి

గోల్కొండ: తెలంగాణలో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జి.ఆనంద్‌గౌడ్ అన్నారు. బుధవారం గుడిమల్కాపూర్‌కు చెందిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యాలయ సహ కార్యదర్శి ప్రభుపూజారి ఆయనను సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ అవకతవక విధానాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణను అప్పుల ఊబిలో తోశారన్నారు. మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లను కూల్చి ఆనందపడుతున్న ముఖ్యమంత్రి తనను గొప్ప నాయకుడిగా చిత్రీకరించుకుంటున్నారన్నారు. దేశంలో ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీకి డబ్బు మూటలు పంపుతున్నారని ఆరోపించారు. హైడ్రా పేరుతో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగాన్ని దెబ్బతీశారన్నారు. ముందస్తు ప్రణాళిక లేకుండా చేపట్టిన కుల గణన సర్వే కూడా విజయవంతం కావడం లేదన్నారు. భవిష్యత్తులో ప్రజలు కాంగ్రెస్‌ను ఛీకొట్టడం ఖాయమని బీఆర్‌ఎస్ కాలగర్భంలో కలిసినట్లే కాంగ్రెస్ కనుమరుగు కావడం ఖాయమన్నారు.

గురువులను సత్కరించుకోవడం మన బాధ్యత



పీఠాధిపతి ఆధిత్య పరాశ్రీ స్వామీజీని సత్కరిస్తున్న ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: గురువులను సత్కరించుకోవడం శిష్యుల బాధ్యతని అందులో అద్భుతమైన దార్శనికత దాగి ఉందని అంబాత్రయ క్షేత్ర పీఠాధిపతి ఆధిత్య పరాశ్రీ స్వామీజీ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శృతిలయ ఫౌండేషన్, సీల్‌వెల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పీఠాధిపతి ఆధిత్య పరాశ్రీ స్వామి ప్రవచనం, గురువందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీని జ్ఞాన సంపూర్ణానంద పురస్కారంతో సత్కరించారు. అంతకు ముందు ప్రముఖ గాయని పి.సుశీల 89వ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె.దామోదర్ గుప్తా, కళా పత్రిక సంపాదకులు మహ్మద్ రఫీ, ఎల్ఐసీ అధికారి సుబ్రమణ్యం, శృతిలయ కార్యదర్శి ఆమని, కుసుమ భోగరాజు తదితరులు పాల్గొన్నారు.